సాక్షి
ఖమ్మం
మంగళవారం । 24 । డిసెంబర్ । 2024



ప్రశాంతతకు నిలయం

జిల్లాలో అతిపెద్ద చర్చిల్లో ఒకటైన తల్లాడ లూర్థు మాత చర్చి ప్రశాంతతకు నిలయంగా నిలుస్తోంది. ఇక్కడ క్రిస్మస్‌కు ఏర్పాట్లు చేస్తున్నారు. 8లో



యాచించడం కాదు.. సాధిస్తాం!

యాచించడం తప్ప వేరే పని దక్కని హిజ్రాల స్వయం ఉపాధి కల్పనకు కలెక్టర్, మెప్మా అధికారులు రుణ ఏర్పాట్లు చేస్తున్నారు. 10లో

వాతావరణం

గరిష్టం / కనిష్టం
28° / 20°

జిల్లాలో మంగళవారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. కొన్ని చోట్ల చిరు జల్లులు పడి, రాత్రి వాతావరణం చల్లగా ఉంటుంది.

న్యూస్‌రీల్

‘పేదోళ్ల ప్లీడర్ శంకరన్న’ పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న జిల్లా జడ్జి తదితరులు

ఖమ్మం లీగల్ : అర్ధ శతాబ్దానికి పైగా న్యాయవాద వృత్తిలో కొనసాగిన చల్లా శంకర్ స్మారక పుస్తకం ‘పేదోళ్ల ప్లీడర్ శంకరన్న’ పుస్తకాన్ని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.రాజగోపాల్ సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ సీనియర్ న్యాయవాది చల్లా శంకర్ తన జీవిత కాలంలో దళితులకు, మహిళలకు వ్యతిరేకంగా కేసులు వేయలేదని అన్నారు. ఒకవైపు వృత్తిని కొనసాగిస్తూనే మరోవైపు విప్లవ రాజకీయాల్లో చురుకుగా పాల్గొన్నారని కొనియాడారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నేరెళ్ల శ్రీనివాస్, బార్ కౌన్సిల్ సభ్యులు, సీనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

మొబైల్ కోర్టు న్యాయమూర్తిగా నాగలక్ష్మి

స్థానిక మొబైల్ కోర్టు న్యాయమూర్తిగా బక్కర నాగలక్ష్మి నియమితులయ్యారు. ఈ మేరకు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం పరిచయ కార్యక్రమం నిర్వహించగా.. జిల్లా ప్రధాన న్యాయమూర్తి రాజగోపాల్ హాజరై మాట్లాడారు. నాగలక్ష్మి కాకతీయ యూనివర్సిటీ నుంచి లా డిగ్రీ, ఉస్మానియా యూనివర్సిటీ నుంచి ఎల్‌ఎల్‌ఎం పూర్తి చేశారు. న్యాయవాదిగా వరంగల్ బార్‌లో నమోదై ప్రాక్టీస్ చేశారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు నేరెళ్ల శ్రీనివాస్, చింతనిప్పు వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో నేడు డిప్యూటీ సీఎం భట్టి పర్యటన

ఖమ్మంవన్‌టౌన్: రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క జిల్లాలో మంగళవారం పర్యటించనున్నారు. ఉదయం 7.30 గంటలకు హైదరాబాద్ ప్రజాభవన్ నుంచి బయలుదేరి 11 గంటలకు ఖమ్మం చేరుకుంటారు. 12 నుంచి 2 గంటల వరకు ఖమ్మం ప్రజాభవన్‌లో ముదిగొండ, చింతకాని, బోనకల్ మండలాల పార్టీ సభ్యులతో సమావేశం నిర్వహిస్తారు. 3.30 గంటలకు ఖమ్మం నుంచి బయలుదేరి 4.15 గంటలకు మధిర చేరుకుని మధిర, ఎర్రుపాలెం మండల కమిటీ సభ్యులతో మాట్లాడతారు. ఆ తర్వాత బయ్యారంలో క్రిస్మస్ వేడుకల్లో పాల్గొంటారు. రాత్రి మధిరలో బసచేస్తారు. బుధవారం ఉదయం 7.30 గంటలకు మధిర నుంచి బయలుదేరి 11 గంటలకు హైదరాబాద్ వెళతారు. ఈ మేరకు షెడ్యూల్ విడుదలైంది.

మెడికల్ కోర్సుల్లో వార్షిక పరీక్షలు ప్రారంభం

ఖమ్మంవైద్యవిభాగం : జిల్లాలోని వివిధ కళాశాలలకు చెందిన డిప్లొమా విద్యార్థులకు సోమవారం ఖమ్మం ప్రభుత్వ మెడికల్ కళాశాలలో వార్షిక పరీక్షలు ప్రారంభమయ్యాయి. డిప్లొమా ఇన్ మెడికల్ టెక్నీషియన్, డిప్లొమా ఇన్ ఆప్తాల్మిక్ అసిస్టెంట్, డిప్లొమా ఇన్ డయాలసిస్ టెక్నీషియన్ కోర్సుల విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. తొలిరోజు మొత్తం 12 కళాశాలలకు చెందిన 436 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు.

పదోన్నతులపై విచారణ

ఖమ్మం సహకారనగర్ : సుమారు ఐదు నెలల క్రితం జరిగిన ఉపాధ్యాయ బదిలీల్లో ఎస్జీటీలకు స్కూల్ అసిస్టెంట్(స్పెషల్ ఎడ్యుకేషన్)గా పలువురికి పదోన్నతులు లభించాయి. అందులో ఏడుగురి బదిలీలపై ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో సోమవారం డీఈఓ కార్యాలయంలో విచారణ చేపట్టారు. కాగా, మంగళవారం కూడా విచారణ కొనసాగుతుందని డీఈఓ సోమశేఖర శర్మ తెలిపారు.

జోరుగా కొనుగోళ్లు



నేలకొండపల్లి మండలం బైరవునిపల్లిలో ధాన్యం కాంటా వేస్తున్న దృశ్యం

వాతావరణ మార్పులతో ధాన్యం విక్రయానికి రైతుల హడావుడి

- మందకొడిగా ప్రారంభమైనా.. ఊపందుకున్న సేకరణ
- జిల్లాలో 344 కొనుగోలు కేంద్రాలు
- ఇప్పటివరకు సేకరించిన ధాన్యం 19,01,950 క్వింటాళ్లు

సాక్షిప్రతినిధి, ఖమ్మం : జిల్లాలో ధాన్యం సేకరణ ఊపందుకుంది. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్ప పీడనంతో మబ్బులు పట్టి.. జల్లులు కురుస్తుండడంతో రైతులు ధాన్యం అమ్మకానికి హడావుడి చేస్తున్నారు. మిల్లులు, కొనుగోలు కేంద్రాలకు వేగంగా తరలిస్తున్నారు. కల్లాల్లో ఉన్న ధాన్యాన్ని రక్షించుకునేందుకు నానా తంటాలు పడుతున్నారు. జిల్లాలో మొత్తం 344 కొనుగోలు కేంద్రాలు తెరవగా.. అన్ని కేంద్రాల్లోనూ ధాన్యం సేకరణ జరుగుతోంది. ఇప్పటి వరకు 19,01,950 క్వింటాళ్ల మేర ధాన్యం కొనుగోలు చేశారు. కాగా, కొందరు రైతులు మిల్లులకు కూడా ధాన్యం తరలిస్తున్నారు.

లక్ష్యం.. 42.96 లక్షల క్వింటాళ్లు

ఈ వానాకాలం సీజన్‌లో రైతులు వరి సాగుపై మొగ్గు చూపారు. సన్నరకం ధాన్యానికి ప్రభుత్వం రూ.500 బోనస్ ప్రకటించడంతో రైతులు ఈ రకం సాగుకే ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చారు. మరోవైపు వర్షాలు సమృద్ధిగా కురవడం, జలాశయాల్లోకి నీరు రావడంతో పంటల సాగులో ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాలేదు. జిల్లాలో మొత్తం 2,81,991 ఎకరాల్లో వరి వేయగా.. అందులో 2,62,230 ఎకరాల్లో సన్న రకాలే పండించారు. మరో 19,761 ఎకరాల్లో దొడ్డు రకాలు సాగయ్యాయి. మొత్తంగా 67,74,500 క్వింటాళ్ల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా వేసిన పౌర సరఫరాల సంస్థ అధికారులు.. 42,96,300 క్వింటాళ్ల ధాన్యాన్ని సేకరణకు ప్రణాళిక సిద్ధం చేశారు.

ముందస్తు ప్రణాళికతో..

ఈ వానాకాలం సీజన్‌లో ధాన్యం సేకరణకు పౌర సరఫరాల సంస్థ అధికారులు ప్రణాళికాయుతంగా వ్యవహరించారు. కేంద్ర ప్రభుత్వం ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌కు సాధారణ ధాన్యం క్వింటాకు రూ.2,300, గ్రేడ్–ఎ (సన్న రకం) ధాన్యానికి రూ.2,320 కనీస మద్దతు ధరగా నిర్ణయించింది. మరోవైపు రాష్ట్ర ప్రభుత్వం సన్నరకం ధాన్యం క్వింటాకు రూ.500 బోనస్ ప్రకటించింది. ఇదే అంశంపై రైతులకు అవగాహన కల్పిస్తూ ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలని గ్రామాల్లో విస్తృత ప్రచారం నిర్వహించారు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తోందని, బహిరంగ మార్కెట్ కంటే ఈ కేంద్రాల్లోనే మద్దతు ధర లభిస్తుందని వివరించారు.

తుపాన్ ప్రభావంతో మరింత వేగం..

ధాన్యం కొనుగోళ్లకు పౌర సరఫరాల సంస్థ కేంద్రాలు ఏర్పాటు చేసింది. అలాగే మిల్లర్లు కూడా ధాన్యాన్ని సేకరిస్తున్నారు. ఇప్పటి వరకు వేచి చూసే ధోరణిలో ఉన్న రైతులు.. ప్రస్తుతం తమ వద్ద ఉన్న ధాన్యాన్ని విక్రయించేందుకు హడావుడి పడుతున్నారు. తుపాను ప్రభావం జిల్లాపై కూడా పడుతుండడంతో ధాన్యం విక్రయాలకు ఎక్కువ మంది ముందుకొస్తున్నారు. కొన్నిచోట్ల విక్రయం కోసం కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తరలించగా.. మరికొందరు రైతులు కల్లాల్లో ఆరబోసి ఉంచారు. ఇటీవల జల్లులు కురిసిన సమయంలో టార్పాలిన్లు కప్పి రక్షించుకున్నారు. అలాగే చలి విపరీతంగా ఉండటంతో మంచు ప్రభావంతో ధాన్యం తడుస్తోంది. వీటన్నింటినీ దృష్టిలో పెట్టుకున్న రైతులు పౌర సరఫరాల సంస్థ ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో, మిల్లుల్లో విక్రయించేందుకు ధాన్యాన్ని తరలిస్తున్నారు.

మందకొడిగా ప్రారంభమైనా..

ధాన్యం కొనుగోళ్లపై అధికారులు విస్తృత స్థాయిలో ప్రచారం చేసినా తొలినాళ్లలో రైతులు కొనుగోలు కేంద్రాలకు తక్కువగానే ధాన్యాన్ని తరలించారు. గతనెల 8 నుంచి జిల్లా వ్యాప్తంగా 344 కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వం ప్రారంభించినా అంతగా ఫలితం కనిపించలేదు. అయితే సన్నధాన్యానికి బోనస్ ప్రకటించడం, మద్దతు ధర ఉండడంతో ఆ తర్వాత కొనుగోళ్లు పెరిగాయి. ఇప్పటివరకు 31,223 మంది రైతుల నుంచి 19,01,950 క్వింటాళ్ల ధాన్యాన్ని డీఆర్‌డీఏ, పీఏసీఎస్, డీసీఎంఎస్, మెప్మా ద్వారా ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో సేకరించారు. ధాన్యం అమ్మిన రైతులకు బోనస్ కూడా ఖాతాల్లో జమ కావడంతో మరింత మంది ముందుకొస్తున్నారు.

జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు ఇలా..

జిల్లాలో మొత్తం వరి సాగు విస్తీర్ణం	సన్న రకం ధాన్యం సాగు	దొడ్డు రకం ధాన్యం	దిగుబడి అంచనా	కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరించే లక్ష్యం	ప్రారంభమైన కొనుగోలు కేంద్రాలు	ఇప్పటివరకు సేకరించిన ధాన్యం
2,81,991 ఎకరాలు	2,62,230 ఎకరాలు	19,761 ఎకరాలు	67,74,500 క్వింటాళ్లు	42,96,300 క్వింటాళ్లు	334	19.01,950 క్వింటాళ్లు

తీగల వంతెన పనుల్లో వేగం పెంచాలి



అధికారులతో చర్చిస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

- 2025 చివరి నాటికి బ్రిడ్జి ప్రారంభం కావాలి
- బైపాస్, ప్రకాశ్‌నగర్ బ్రిడ్జీల మరమ్మతులు పూర్తి చేయండి
- అధికారులకు మంత్రి తుమ్మల ఆదేశం

ఖమ్మంవన్‌టౌన్: నగరంలో నిర్మిస్తున్న తీగల వంతెన ఖమ్మం గుమ్మానికి మణిహారంగా నిలుస్తుందని, యుద్ధ ప్రాతిపదికన పనులు పూర్తి చేయాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. ఆర్‌అండ్‌బీ శాఖ అధికారులు, తీగల బ్రిడ్జి నిర్మాణ సంస్థ ప్రతినిధులతో సోమవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ హైదరాబాద్ తర్వాత ఖమ్మం నగరం అభివృద్ధిలో దూసుకుపోతోందని అన్నారు. మున్నేరు తీగల వంతెన అద్భుతమైన ఆకర్షణతో ఖమ్మానికి ల్యాండ్ మార్క్ కాబోతోందన్నారు. వచ్చే ఏడాది డిసెంబర్ 31 లోగా బ్రిడ్జి నిర్మాణ పనులు పూర్తి చేయాలన్నారు. అత్యాధునిక టెక్నాలజీతో అబ్బురపరిచేలా నిర్మిస్తున్న తీగల వంతెనను కొత్త ఏడాదిలో ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. ఈ వంతెనతో ప్రజలకు ట్రాఫిక్ ఇబ్బందులు తొలగడంతో పాటు ఖమ్మం అభివృద్ధికి దిక్సూచిగా నిలుస్తుందన్నారు. 2026 జనవరిలో అట్టహాసంగా ఈ బ్రిడ్జి ప్రారంభోత్సవాన్ని నిర్వహించేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఖమ్మం నగరంలోని సూర్యాపేట – అశ్వారావుపేట ప్రధాన రహదారిలో 57/150 –58/400 రహదారిపై ఈ తీగల వంతెన నిర్మిస్తున్నట్లు వివరించారు. మహారాష్ట్రలోని నాసిక్‌కు చెందిన ఎంఎస్ అశోక బిల్డకన్ సంస్థ రూ.180 కోట్లతో ఈ బ్రిడ్జిని 24 నెలల్లో శరవేగంగా నిర్మిస్తోందని మంత్రి కితాబు ఇచ్చారు. మొత్తం 16 ఫౌండేషన్లలో 12 ఫౌండేషన్లు పీఆర్ బెడ్ బాక్సులతో సహా పూర్తయ్యాయన్నారు. మిగిలిన పనులను వచ్చే సంవత్సరం చివరి నాటికి పూర్తి చేయాలన్నారు. ట్రాఫిక్‌ను దారి మళ్లించేందుకు డైవర్షన్ రోడ్డును పాత వంతెనకు సమాంతరంగా నిర్మిస్తున్నామని తెలిపారు. డైవర్షన్ రోడ్డు పాత కాజ్ వే ని తారు రోడ్డు గా నిర్మించాలని మంత్రి ఆదేశించారు. వర్షాకాలంలో కూడా ట్రాఫిక్ నియంత్రణకు పాత వంతెనను వాడుకునేలా ఏర్పాట్లు చేయాలన్నారు. నగరంలోని బైపాస్ రోడ్‌లో గల ఆర్‌అండ్‌బీ బ్రిడ్జి, ప్రకాష్‌నగర్ వంతెనతో పాటు అన్ని వంతెనల మరమ్మతులు శరవేగంగా చేయాలని సూచించారు.

జిల్లాలో నేడు పర్యటన

మంత్రి తుమ్మల నాగేశ్వరరావు నేటి నుంచి జిల్లాలో పర్యటించనున్నారు. మంగళవారం మధ్యాహ్నం హైదరాబాద్ నుంచి బయలుదేరి రఘునాథపాలెం మండలం దోనబండ, ఈర్లపూడి, కొర్లబోడు తండాల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారు. బుధవారం ఉదయం 5.45 గంటలకు చర్చ్‌కాంపౌండ్‌లో చర్చిలో క్రిస్మస్ వేడుకల్లో పాల్గొంటారు. గురువారం ఉదయం 9 గంటలకు సత్తుపల్లి మండలం బుగ్గపాడు – నాగుపల్లి ఆర్‌అండ్‌బీ రోడ్డు నిర్మాణానికి, 10 గంటలకు కాకర్లపల్లిలో బీటీ, సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తారు. కో–ఆపరేటివ్ సొసైటీ భవనాన్ని ప్రారంభిస్తారు. 11గంటలకు తల్లాడ మండలం నూతన్‌కల్‌లో కో – ఆపరేటివ్ భవన ప్రారంభోత్సవం చేస్తారు. 12 గంటలకు ఖమ్మం 18వ డివిజన్‌లో బీటీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారు.

సమస్యలు సత్వరమే పరిష్కరించాలి



ఫిర్యాదులు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్లు

అదనపు కలెక్టర్లు శ్రీజ, శ్రీనివాస్‌రెడ్డి

ఖమ్మంసహకారనగర్: ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి అధికారులు చర్యలు చేపట్టాలని అదనపు కలెక్టర్లు పి. శ్రీజ, పి.శ్రీనివాస్‌రెడ్డి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో వారు ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. అనంతరం టీజీఓస్ ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించగా అదనపు కలెక్టర్లు కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు, డీఆర్వో ఎం.రాజేశ్వరి, కలెక్టరేట్ పరిపాలన అధికారి అరుణ తదితరులు పాల్గొన్నారు. ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదుల్లో కొన్ని ఇలా..

- కామేపల్లి మండలం పండితాపురంలో సర్వే నంబర్ 77లో 1.20 ఎకరాల వ్యవసాయ భూమి తన తల్లి పేరున ఉందని, ఆ భూమిపైనే ఆధారపడి జీవిస్తున్నామని, పదేళ్ల క్రితం ఎస్టీపీసీ స్వాధీనం చేసుకుని జీవనోపాధి కల్పిస్తామని హామీ ఇచ్చారని, ఇప్పటివరకు ఎలాంటి ఉద్యోగం ఇవ్వలేదని గ్రామానికి చెందిన బి.రవి ఫిర్యాదు చేయగా.. దాన్ని ఖమ్మం ఆర్డీఓకు ఎండార్స్ చేశారు.
- రఘునాథ పాలెం మండలం బూడిదంపాడుకు చెందిన కె. శిల్ప.. తాను ప్రజాపాలన సభల్లో ఇందిరమ్మ ఇంటికోసం దరఖాస్తు చేశానని, సర్వేలో తన పేరు రాలేదని, ఆన్‌లైన్‌లో పేరు వచ్చేలా చేయాలని కోరుతూ దరఖాస్తు చేసింది. దాన్ని హౌసింగ్ ఈఈకి పంపించి పరిశీలించాలని సూచించారు.
- కల్లూరు మండలం చెన్నూరు గ్రామానికి చెందిన తుడుం బేబీ తాము ఎస్సీ కులానికి చెందిన వారమని, కూలి పని చేస్తూ జీవిస్తున్నామని, ప్రభుత్వం నుంచి వ్యవసాయ భూమి ఇప్పించాలని కోరగా కల్లూరు తహసీల్దార్‌కు దరఖాస్తును ఎండార్స్ చేశారు.

పాలేరు రిజర్వాయర్ పరిశీలన

కూసుమంచి : పాలేరు రిజర్వాయర్‌ను జలవనరుల శాఖ ఇంజనీర్ ఇన్ చీఫ్ (ఈఎన్‌సీ)అనిల్‌కుమార్ సోమవారం పరిశీలించారు. రిజర్వాయర్‌తో పాటు రంగుల బ్రిడ్జి, యూటీ, ఔట్ ఫాల్ కెనాల్, రిజర్వాయర్ గేట్లను తనిఖీ చేసి సీఈ విద్యాసాగర్‌ను వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఇటీవలి వరదలతో సంభవించిన నష్టాన్ని ఈఎన్‌సీకి అధికారులు వెల్లడించారు. సాగునీటి విడుదల తదితర అంశాలపై ఆయన అధికారులతో చర్చించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎస్ఈ మంగళంపూడి వెంకటేశ్వర్లు, ఈఈ అనన్య, డీఈఈ రమేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సర్వే త్వరగా పూర్తి చేయాలి

ముదిగొండ : ఇందిరమ్మ ఇళ్ల సర్వే త్వరగా పూర్తి చేయాలని డీపీఓ ఆశాలత పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. మండలంలోని కమలాపురం, న్యూలక్ష్మీపురం గ్రామాల్లో సోమవారం ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి సమగ్రమంగా సర్వే నిర్వహించాలన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహించొద్దని సూచించారు. ఏమైనా సమస్యలుంటే తమ దృష్టికి తేవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీఓ వాల్మీకి కిషోర్, పంచాయతీ కార్యదర్శులు సురేష్, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఓటు హక్కు కల్పించాలి

ఎలక్టోరల్ రోల్ పరిశీలకులు బాలమాయా దేవి



మాట్లాడుతున్న బాలమాయాదేవి, పక్కన అదనపు కలెక్టర్లు శ్రీజ, శ్రీనివాస్‌రెడ్డి

ఖమ్మంసహకారనగర్: జిల్లాలో 18 సంవత్సరాలు నిండిన అర్హులైన ప్రతీ ఒక్కరికి ఓటు హక్కు కల్పించాలని ఎలక్టోరల్ రోల్ పరిశీలకులు బి. బాలమాయా దేవి అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో ఓటర్ సవరణ జాబితా 2025 పై అదనపు కలెక్టర్లు పి. శ్రీజ, పి.శ్రీనివాస్ రెడ్డితో కలిసి సమీక్షించారు. ఓటర్ జాబితా సవరణపై చేపడుతున్న చర్యలను అదనపు కలెక్టర్లు, అధికారులు వివరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఓటర్ జాబితాలో నూతనంగా నమోదవుతున్న వారి వివరాలను తనిఖీ చేయాలని సూచించారు. ఓటర్ జాబితాకు సంబంధించి వచ్చిన ప్రతి అభ్యంతరం, క్లెయిమ్‌ను పూర్తిస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని అన్నారు. జాబితా నుంచి ఓటు తొలగిస్తే స్పష్టమైన సమాచారం, కారణాలు ఉండాలని, ఓటర్ జాబితా సవరణ పూర్తి పారదర్శకంగా జరగాలని, ప్రతి కార్యక్రమంలో రాజకీయ పార్టీల ప్రతినిధులను భాగస్వామ్యం చేయాలని సూచించారు. అదనపు కలెక్టర్లు మాట్లాడుతూ జిల్లాలో డ్రాఫ్ట్ ఓటర్ జాబితా సందర్భంగా ఫారం 6, 6ఏ, 7, 8 దరఖాస్తులు 21,274 రాగా, ఇప్పటివరకు 18,192 దరఖాస్తులు పరిష్కరించామని, 2,977దరఖాస్తులు తిరస్కరించగా, 105 పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. గత నెలలో నిర్వహించిన స్పెషల్ క్యాంపెయిన్‌లో జిల్లాలో 1,181 దరఖాస్తులు వచ్చాయని చెప్పారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారిణి ఎం.రాజేశ్వరి, ఆర్డీఓలు నర్సింహారావు, రాజేందర్ పాల్గొన్నారు.

వసతిగృహాల్లో తనిఖీ..

ఖమ్మంమయూరిసెంటర్ : జిల్లా పర్యటనకు వచ్చిన బీసీ సంక్షేమశాఖ రాష్ట్ర కమిషనర్ బాలమాయాదేవి సోమవారం ఖమ్మం నగరంలోని బీసీ సంక్షేమ శాఖ కళాశాల బాలికల వసతిగృహాలను సందర్శించారు. నగరంలోని పాకబండ బజార్‌లో గల బాలికల హాస్టళ్లలో ఆవరణ, కిచెన్, గదులను తనిఖీ చేశారు. విద్యార్థినులతో మాట్లాడి అందుతున్న సౌకర్యాలపై ఆరా తీశారు. ప్రభుత్వం సంక్షేమ వసతిగృహాల విద్యార్థులకు సౌకర్యాలు మెరుగుపర్చడంతో పాటు నాణ్యమైన భోజనం, వసతి కల్పిస్తున్నట్లు తెలిపారు. వసతిగృహాల నిర్వహణ పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం విద్యార్థినులతో కలిసి టిఫిన్ తిన్నారు. ఆమె వెంట జిల్లా బీసీ సంక్షేమాధికారిణి జి.జ్యోతి ఉన్నారు.

నిల్వలు ఫుల్.. ఉపాధి డల్

- భద్రాద్రి జిల్లాలో 150 ఏళ్లకు సరిపడా బొగ్గు నిక్షేపాలు
- అయినా సింగరేణిలో తగ్గిపోతున్న కార్మికుల సంఖ్య
- కొత్త గనుల్లేక కళ కోల్పోయిన ఇల్లెందు

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: ప్రస్తుత వేగంతో తవ్వకాలు చేపడితే మరో 150 ఏళ్లకు సరిపడా బొగ్గు నిల్వలు గోదావరి–ప్రాణహిత లోయలో ఉన్నాయి. సింగరేణి బొగ్గు అన్వేషణ విభాగం రికార్డులు ఈ విషయాన్ని ధ్రువీకరిస్తున్నాయి. నిక్షేపాల నిల్వల్లో భద్రాద్రి కొత్తగూడెం ద్వితీయ స్థానంలో ఉంది. అయినా జిల్లాలో రోజురోజుకూ సింగరేణి కార్మికుల సంఖ్య తగ్గిపోతోంది. రాష్ట్రంలో సంస్థ విస్తరించిన ఆరు జిల్లాల పరిధిలో 11,849.54 మెట్రిక్ టన్నుల బొగ్గు నిల్వలు ఉన్నాయి. 16 ఓపెన్‌కాస్టులు, 18 అండర్‌గ్రౌండ్ మైన్ల ద్వారా ఉత్పత్తి జరుగుతుండగా, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 72 మిలియన్ టన్నుల బొగ్గు వెలికితీయాలని లక్ష్యంగా నిర్ణయించారు.

ప్రమాదంలో ఇల్లెందు ఏరియా

సింగరేణి వ్యాప్తంగా మంచిర్యాల తర్వాత అత్యధిక బొగ్గు నిల్వలు భద్రాద్రి జిల్లా పరిధిలోనే ఉన్నాయి. 130 ఏళ్లుగా ఇల్లెందులో, 90 ఏళ్లుగా కొత్తగూడెంలో, 50 ఏళ్లుగా మణుగూరులో బొగ్గు వెలికితీస్తున్నా నిక్షేపాలు తరిగిపోలేదు. జిల్లాలో ఇంకా 3136.70 మెట్రిక్ టన్నుల నిల్వలు ఉన్నాయి. అయినా జిల్లాలో సింగరేణి కాంతులు క్రమంగా తగ్గుతున్నాయి. ఇల్లెందు ఏరియా ఇప్పటికే సింగరేణి ఆనవాళ్లు కనుమరుగయ్యే ప్రమాదంలో ఉంది. మరో 15 ఏళ్లలో మణుగూరులోనూ బొగ్గు తవ్వకాలు ఆగిపోతాయంటూ ఇటీవల సింగరేణి ఉన్నతాధికారుల ప్రకటించారు.

అరువు తెచ్చుకున్న టెక్నాలజీతో..

బొగ్గు తవ్వకాల్లో వందేళ్ల అనుభవం ఉన్న ఇప్పటికీ సింగరేణికి రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ విభాగం పూర్తిస్థాయిలో లేదు. రష్యా, చైనా, యూరప్, ఆస్ట్రేలియా దేశాల్లో మైనింగ్ రంగంలో అభివృద్ధి చేసిన టెక్నాలజీనే అరువు తెచ్చుకునే పరిస్థితి ఉంది. స్థానిక పరిస్థితులకు తగ్గట్టుగా తక్కువ ఖర్చుతో ఉత్పత్తి చేసే టెక్నాలజీని అందిపుచ్చుకోవడంలో దశాబ్దాలుగా సింగరేణి దృష్టి సారించడం లేదు. ఫలితంగా బొగ్గు నిల్వలు ఉన్నప్పటికీ వెలికి తీయలేని పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా స్థానిక పరిస్థితులకు తగిన కొత్త టెక్నాలజీ అభివృద్ధిపై యాజమాన్యం దృష్టి సారించాలి.



సింగరేణి ప్రధాన కార్యాలయం

కొత్త గనుల్లేక తగ్గుతున్న ఉపాధి అవకాశాలు

మంచిర్యాల, పెద్దపల్లి జిల్లాలతో పోల్చినప్పుడు ఇక్కడి నిల్వలు ఎక్కువ లోతులో ఉన్నాయి. భూమి నుంచి మూడు వందల మీటర్ల కంటే ఎక్కువ లోతులో బొగ్గు నిక్షేపాలు ఉంటే ఓపెన్‌కాస్ట్ మైనింగ్‌తో తీయడం సాధ్యం కాదు. భూగర్భ గనుల ద్వారానే వెలికి తీయాల్సి ఉంటుంది. కానీ ఈ విధానంలో బొగ్గు ఉత్పత్తి వ్యయం ఎక్కువనే కారణంతో సింగరేణి కొత్త గనులు ప్రారంభించేందుకు సిద్ధంగా లేదు. దీంతో బొగ్గు నిల్వలు విస్తారంగా ఉన్నా ఇక్కడ ఆశించిన స్థాయిలో కొత్త గనులు రావడం లేదు. ఫలితంగా స్థానికులకు ఉపాధి అవకాశాలు తగ్గిపోతున్నాయి. ఇల్లెందు ఏరియాలో కార్మికుల సంఖ్య 300కు పడిపోయింది.

క్లుప్తంగా

ధాన్యం కొనుగోళ్లు సజావుగా సాగాలి



రికార్డులు పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి

కామేపల్లి: రైతులను ఏ మాత్రం ఇబ్బంది పెట్టకుండా ధాన్యం కొనుగోళ్లు సజావుగా సాగించాలని అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి అన్నారు. మండలంలోని పొన్నేకల్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం ఆయన తనిఖీ చేశారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించి మద్దతు ధర పొందాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ సుధాకర్, ఎంపీడీఓ రవీందర్, ఏఓ తారాదేవి, ఆర్‌ఐ సక్రు, ఏఈఓ ఉష పాల్గొన్నారు.

టీజీవోస్ ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్



కేక్ కట్ చేస్తున్న అదనపు కలెక్టర్

ఖమ్మంసహకారనగర్: తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీజ.. అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డితో కలిసి క్రిస్మస్ కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ రాజేశ్వరి, కస్తాల సత్యనారాయణ, మోదుగు వేలాద్రి, సన్యాసయ్య, కొణిదేన శ్రీనివాసరావు, గుంటపల్లి శ్రీనివాసరావు, జైపాల్, తాళ్లూరు శ్రీకాంత్, కోణార్, ఆయుష్ ప్రకాష్, వెంకన్న, ఎర్ర రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శరైతు సత్యనారాయణరెడ్డికి అవార్డు



అవార్డు అందుకుంటున్న సత్యనారాయణరెడ్డి

వేంసూరు: జాతీయ రైతు దినోత్సవాన్ని పురస్కరించుకుని కందుకూరు గ్రామానికి చెందిన ఆదర్శరైతు గొర్ల సత్యనారాయణరెడ్డికి దేశీయ వరి రకాల నుంచి కొత్త విత్తనాలను అభివృద్ధి పరుస్తున్నందుకు గాను భూమిరత్న అవార్డు అందజేశారు. ఏపీలోని అనంతపురంలో రెండు తెలుగు రాష్ట్రాల పరిధిలో రైతు సహాయ వేదిక సేవాసంస్థ ఆధ్వర్యంలో చరణ్‌సింగ్ పుట్టినరోజు సందర్భంగా రైతులకు ఈ అవార్డు ప్రదారం చేశారు. ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు.

భూమిరత్న అవార్డు ప్రదానం

మధిర: పట్టణానికి చెందిన సేంద్రియ సాగు రైతు చీకటి నాగేశ్వరరావు భూమిరత్న అవార్డు అందుకున్నారు. ఆయన రాయపట్నం రోడ్డులో ఉన్న మాగాణి భూమిలో సేంద్రియ ఎరువులతో వరి సాగు చేస్తున్నారు. జాతీయ రైతు దినోత్సవం సందర్భంగా సోమవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అనంతపురంలో రైతు సహాయ వేదిక ఆధ్వర్యంలో ఆయనకు భూమిరత్న అవార్డుతో పాటు మెమెంటో, ప్రశంసాపత్రాన్ని అందజేశారు.

ర్యాలీకి తరలిరావాలి

ఖమ్మంవన్‌టౌన్: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్‌పై ఇటీవల పార్లమెంట్‌లో కేంద్ర హోం మంత్రి అమిత్‌షా చేసిన వివాదాస్పద వ్యాఖ్యలకు నిరసనగా ఖమ్మం జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించే ర్యాలీకి పార్టీ శ్రేణులు భారీగా హాజరుకావాలని ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి పిలుపునిచ్చారు. ఉదయం 10 గంటలకు కాంగ్రెస్ జిల్లా కార్యాలయం సంజీవరెడ్డిభవన్ నుంచి జెడ్పీసెంటర్ వరకు నిరసన ర్యాలీ ఉంటుందన్నారు.

ప్లాస్టిక్ కవర్లు సీజ్



ప్లాస్టిక్ కవర్లను సీజ్ చేస్తున్న అధికారులు

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలోని 39వ డివిజన్ శివాలయం బజార్‌లో ఓ భవనంలో నిల్వ ఉంచిన నిషేధిత ప్లాస్టిక్ సంచులను కేఎంసీ సిబ్బంది సోమవారం సీజ్ చేశారు. ప్లాస్టిక్ సంచుల వ్యాపారికి అధికారులు రూ.10 వేల జరిమానా విధించి, సీజ్ చేసిన వాటిని కేఎంసీకి తరలించారు. నిషేధించిన ప్లాస్టిక్‌ను విక్రయించడం, వినియోగించడం సరికాదని పేర్కొన్నారు. కార్యక్రమంలో సాంబయ్య, మల్లయ్య, బంగారి మణికుమార్, దుర్గాప్రసాద్, రమేష్, రాంబాబు, జవాన్లు తదితరులు పాల్గొన్నారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.20,413

ప్రశాంతతకు నిలయం

- తల్లాడలోని లూర్దుమాతా ఆలయం
- 25 ఏళ్లుగా ప్రత్యేక ప్రార్థనలు

తల్లాడ: వరంగల్ – దేవరపల్లి జాతీయ రహదారి పక్కనే అతి పెద్ద చర్చి.. తల్లాడ పంచాయతీ పరిధి నారాయణపురం లూర్దుమాతా ఆలయం. జిల్లాలోనే అతిపెద్ద చర్చిల్లో ఒకటిగా ప్రాధాన్యత సంతరించుకుంది. ఇక్కడ క్రిస్మస్ పండుగకు ఏర్పాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయి. క్రిస్మస్ సమీపిస్తున్న కొద్దీ ఇక్కడ సందర్శకుల సంఖ్య పెరుగుతూ ఉంటుంది. ఇక్కడ లూర్దుమాతా దేవాలయం ప్రశాంతతకు నిలయంగా మారిందని సందర్శకులు చెబుతున్నారు. ఏటా డిసెంబర్‌లో చర్చి ప్రాంగణం నూతన శోభను సంతరించుకుంటుంది. ఈ నెల 25న జరగనున్న క్రిస్మస్ పండుగకు లూర్దుమాతా చర్చి ముస్తాబైంది. చర్చి వద్ద లైటింగ్, బాల ఏసు పశువుల పాక, సెట్టింగ్‌ల ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. ఆలయం ముందు 12 అడుగుల స్టార్‌ను ఏర్పాటు చేశారు.


ఆలయ విశిష్టత

జాతీయ రహదారి పక్కనే వైరా రోడ్డులో విశాలమైన స్థలంలో ఈ చర్చి చూపరులను ఇట్టే ఆకట్టుకుంటుంది. 25 ఏళ్ల కిందట రోమన్ కేథలిక్ మిషన్ ఆధ్వర్యంలో నిర్మించిన చర్చి ఇప్పటికీ చెక్కు చెదరకుండా అంతే ఉంది. ఈ లూర్దుమాతా ఆలయంలో అద్భుతమైన కల్వరి కొండలు, ఏసు క్రీస్తు జీవితానికి సంబంధించిన విశేషాలు,



తల్లాడ జాతీయ రహదారి పక్కనే ఉన్న లూర్దుమాతా చర్చి

లూర్దుమాతా చిత్రపటాలు ఎంతో ఆకర్షణీయంగా ఉంటాయి. చర్చిలోపల ఒకేసారి 3 వేల మంది ప్రార్థనలు చేసేవిధంగా హాల్, బాల్కనీ ఉంది. చర్చిగోపురం 150 అడుగుల ఎత్తులో ఉంటుంది. ముఖద్వారం కూడా ఎంతో అందంగా రూపొందించారు. ఈ ఆలయంలో ఏటా క్రిస్మస్, జనవరి ఫస్ట్, ఫిబ్రవరిలో గుడిపండుగ, లూర్దుమాతా మహోత్సవాలు నిర్వహిస్తుంటారు. ప్రతి ఆదివారం ప్రత్యేక ప్రార్థనలు జరుగుతాయి. ఈ చర్చికి అనుసంధానంగా 9 చర్చిలున్నాయి. చర్చి ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. రాష్ట్రం నలు మూలలు,



ఆలయంలోపల ఉన్న కల్వరి కొండలు

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఫాదర్లు, సంఘ ఉపదేశకులు, సిస్టర్లు వివిధ సందర్భాల్లో ఇక్కడకొచ్చి ప్రార్థనలు చేస్తుంటారు.

క్రీస్తు చూపిన మార్గం అనుసరణీయం



దావీదు మహారాజు, భక్తులూ క్రీస్తు రాక కోసం ఎదురుచూశారు. ఈ నిరీక్షణ ఫలితమే క్రిస్మస్. బెత్లహేంలో దైవ కుమారుడైన క్రీస్తు ఉదయించాడు. బాల యేసు పశువుల పాకలో జన్మించడం ఒక అద్భుత కార్యం. అలాంటి రోజును అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకోవటం ఆనవాయితీగా వస్తోంది. క్రీస్తు ఉదయించిన క్రిస్మస్ సందర్భంగా ప్రభువును ప్రస్తుతించుకుందాం. క్రీస్తు చూపిన మార్గం అనుసరణీయం.

– అజయ్, లూర్దుమాతా ఆలయం విచారణ గురువు

సింగరేణి అభివృద్ధికి కృషి

- సంస్థ సీఎండీ ఎన్.బలరామ్
- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి అభివృద్ధికి కలిసికట్టుగా కృషి చేయాలని సంస్థ సీఎండీ ఎన్.బలరామ్ సూచించారు. సోమవారం కొత్తగూడెం ప్రకాశం స్టేడియంలో జరిగిన సింగరేణి 136వ ఆవిర్భావ వేడుకల్లో ఆయన పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆకాశంలోకి బెలూన్లను వదిలి, స్టాల్స్‌ను ప్రారంభించారు. సాయంత్రం ముగింపు కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ఆరంభించారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ సింగరేణి సంస్థ మరో 100 సంవత్సరాలు విరాజిల్లేందుకు ప్రతి ఉద్యోగి నిబద్ధతతో పనిచేయాలని సూచించారు. సంస్థ మనుగడ మరో 30 ఏళ్లలో కష్టసాధ్యమనుకుంటున్న తరుణంలో మరో వందేళ్లు విరాజిల్లేందుకు విస్తరణ ప్రణాళిక రూపొందిస్తున్నట్లు తెలిపారు. తొలిసారిగా రామగుండంలో 500 మెగావాట్లు, ఇల్లెందులో 100 మెగావాట్ల పంప్డ్ స్టోరేజ్ విద్యుత్ ఉత్పత్తికి సన్నాహాలు చేస్తున్నామని చెప్పారు. ఇతర ప్రైవేట్ కంపెనీల నుంచి పోటీని తట్టుకునేందుకు వినియోగదారుడికి నాణ్యమైన బొగ్గు సరఫరా చేయాలన్నారు. బొగ్గు ఉత్పత్తితోపాటు థర్మల్, సోలార్, పంప్డ్ స్టోరేజ్ విద్యుత్, మిథనాల్ ఉత్పత్తిలో ముందుకు వెళ్లనున్నట్లు తెలిపారు. సోలార్ కమర్షియల్ చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో ఒడిశాలోని నైనీ బ్లాకులో బొగ్గు ఉత్పత్తికి పర్యావరణ అనుమతులు వచ్చాయన్నారు. అక్కడ బొగ్గు ఉత్పత్తికి అన్ని రకాల ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. కాగా ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా డైరెక్టర్లు, అధికారులు కొత్తగూడెం ప్రధాన కార్యాలయం నుంచి ప్రకాశం స్టేడియం వరకు సింగరేణి రన్ నిర్వహించారు.



సింగరేణి పతాకాన్ని ఆవిష్కరించి వందనం చేస్తున్న సీఎండీ బలరాం, ఇతర డైరెక్టర్లు, అధికారులు



నృత్యం చేస్తున్న చిన్నారులు

అనంతరం వివిధ విభాగాల్లో ప్రతిభ కనబరిచిన ఉద్యోగులకు సీఎండీ జ్ఞాపికలు అందజేశారు. ఆ తర్వాత నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ (పా) వెంకటేశ్వరరెడ్డి, డైరెక్టర్ (ఈ అండ్ ఎం) సత్యనారాయణరావు, జీఎం పర్సనల్ (వెల్ఫేర్ అండ్ ఆర్సీ), కార్యక్రమాల కన్వీనర్ కోడూరి శ్రీనివాస్ రావు, గుర్తింపు సంఘం ఏఐటీయూసీ జనరల్ సెక్రటరీ కొరిమి రాజ్‌కుమార్, ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్ ప్రసాద్, జీఎంలు సుభాని, కవితానాయుడు, కార్మిక నాయకులు ఎండీ రజాక్, గట్టయ్య, వీరస్వామి, అధికారులు రామకృష్ణ, రాజారామ్, కోటిరెడ్డి, శివకేశవరావు పాల్గొన్నారు.

రైతు సమ్మేళనంలో నల్లమల

ఖమ్మంవ్యవసాయం: జాతీయ రైతు దినోత్సవం సందర్భంగా కర్ణాటక రాష్ట్ర రైతు సంఘటన ఆధ్వర్యంలో మైసూర్ ఓపెన్ యూనివర్సిటీ కాన్వొకేషన్ హాల్‌లో నిర్వహించిన రైతు సమ్మేళనంలో సంయుక్త కిసాన్ మోర్చా జాతీయ ఉపాధ్యక్షుడు నల్లమల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చిన రైతులు ట్రాక్టర్లు, ఇతర వాహనాలతో భారీ ర్యాలీ నిర్వహించినట్లు వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా రైతు సమస్యలపై ఆమరణ దీక్ష చేస్తున్న జాతీయ రైతు నాయకులు జగ్జీత్‌సింగ్ దల్లేవాల్ గురించి ప్రస్తావించినట్లు వెల్లడించారు.



కేంద్ర మంత్రి సోమన్నను సన్మానిస్తున్న నల్లమల తదితరులు

పీవీ విప్లవాత్మక మార్పులు తెచ్చారు

ఖమ్మంవన్‌టౌన్: దివంగత మాజీ ప్రధానమంత్రి పీవీ నరసింహారావు భారత ఆర్థిక వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తెచ్చారని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ అన్నారు. మాజీ ప్రధాని పీవీ నరసింహారావు 20వ వర్ధంతి సందర్భంగా సోమవారం డీసీసీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కొత్తా సీతారాములు, దొబ్బల సౌజన్య, కార్పొరేటర్లు దుద్దుకూరి వెంకటేశ్వర్లు, లకావత్ సైదులు నాయక్, మాజీ కౌన్సిలర్ పాలకుర్తి నాగేశ్వరరావు, జిల్లా నాయకులు మద్దినేని రమేశ్, కమతం రామకృష్ణ, జిల్లా ఓబీసీ సెల్, ఐఎన్‌టీయూసీ ఉపాధ్యక్షులు



నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

గజ్జెల్లి వెంకన్న, బమ్మిడి శ్రీనివాస్‌యాదవ్, గజ్జి సూర్యనారాయణ, జిల్లా కిసాన్ కాంగ్రెస్ నాయకులు కొట్టెముక్కల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

వ్యక్తిపై బ్లేడుతో దాడి

మధిర : పట్టణంలోని బంజారా కాలనీలో ఓ వ్యక్తి ఉన్మాదిలా వ్యవహరించి మరో వ్యక్తిపై బ్లేడుతో దాడి చేసిన ఘటన సోమవారం రాత్రి చోటుచేసుకుంది. కాలనీకి చెందిన సంజీవ్ ఓ పాస్టర్ ఇంటికి వెళ్తుండగా అదే కాలనీకి చెందిన మున్నా వెనుక నుంచి వచ్చి దాడి చేశాడని, అయితే సంజీవ్‌కు తృటిలో ప్రాణాపాయం తప్పిందని అతడి బంధువులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు.



గాయపడిన సంజీవ్

ఇన్‌ఫార్మర్ నెపంతో యువకుడి హత్య



ముఖేష్ (ఫైల్)

చర్ల: ఇన్‌ఫార్మర్ నెపంతో మావోయిస్టులు ఓ యువకుడిని హతమార్చిన ఘటన ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో సోమవారం ఉదయం చోటుచేసుకుంది. బీజాపూర్ జిల్లా గంగులూరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని కమ్కానార్ గ్రామానికి చెందిన ముఖేష్ హేమ్లా (28) శనివారం గంగులూరుకు వెళ్లి తిరిగి వస్తుండగా మార్గమధ్యలో అడ్డగించిన మావోయిస్టులు అతడిని కిడ్నాప్ చేశారు. రెండు రోజుల తర్వాత హతమార్చి మృతదేహాన్ని సోమవారం ఉదయం కమ్కానార్ గ్రామ శివారులో పడవేశారు. పోలీస్ ఇన్‌ఫార్మర్‌గా వ్యవహరిస్తుండడం వల్లే హతమార్చామని పేర్కొంటూ మావోయిస్టు పార్టీ గంగులూరు ఏరియా కమిటీ ఏరిట మృతదేహం వద్ద లేఖ వదిలారు.

నిజాయితీని చాటుకున్న ఆటోడ్రైవర్

ఖమ్మంక్రైం: తన ఆటోలో మర్చిపోయిన విలువైన ఫోన్‌ను ఆటోడ్రైవర్ ప్రయాణికురాలికి అందజేసిన ఘటన ఖమ్మంలో సోమవారం చోటుచేసకుంది. వైఎస్‌ఆర్ అడ్డాకు చెందిన ఆటోడ్రైవర్ పాషా తన ఆటోలో ఎక్కిన ఓ ప్రయాణికురాలు సెల్‌ఫోన్ మర్చిపోయింది. వెంటనే పాషా తన యూనియన్ నాయకులతో కలిసి ట్రాఫిక్ ఎస్‌ఐ సాగర్ సమక్షంలో తన సెల్‌ఫోన్‌ను వెతుక్కుంటూ ఆటో ఎక్కిన ప్రదేశానికి వచ్చిన ఆమెకు అందజేశారు. పాషాను ట్రాఫిక్ ఎస్‌ఐతోపాటు తోటి ఆటోడ్రైవర్లు అభినదించారు.

క్రాస్ కంట్రీ పోటీల్లో సత్తా

ఖమ్మం స్పోర్ట్స్ : నాగూర్ కర్నూల్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి క్రాస్ కంట్రీ పోటీల్లో జిల్లా అథ్లెట్లు ప్రతిభ చాటారు. జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించిన ఎల్.విక్రమ్ 10 కిలోమీటర్ల పరుగుపందెంలో తృతీయస్థానంలో నిలువగా, ఎస్.కె.సమీరా నాలుగో స్థానంలో నిలిచి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. జనవరిలో ఉత్తరప్రదేశ్‌లో జరిగే జాతీయ స్థాయి క్రాస్‌కంట్రీ పోటీల్లో రాష్ట్రం నుంచి పాల్గొననున్నారు. జిల్లా నుంచి రాష్ట్రస్థాయిలో సత్తా చాటడం పట్ల డీవైఎస్‌ఓ టి.సునీల్‌కుమార్‌రెడ్డి, జిల్లా అథ్లెటిక్స్ సంఘం బాధ్యులు సున్నా రాధాకృష్ణ, మందుల వెంకటేశ్వర్లు, ఎం.డి.షఫీక్ అహ్మద్, సుధాకర్, వెంకటేశ్వర్లు, రవి తదితరులు అభినందించారు.

ట్రాక్టర్లు చోరీ చేస్తున్న ముఠా అరెస్ట్

7 ట్రక్కులు, రెండు ఇంజిన్లు స్వాధీనం

కూసుమంచి: రైతులు నిలిపి ఉంచిన ట్రాక్టర్ ఇంజిన్లు, ట్రక్కులను చోరీ చేసి విక్రయిస్తున్న ఐదుగురు నిందితులను సోమవారం కూసుమంచి పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. వారి నుంచి రెండు ట్రాక్టర్ ఇంజిన్లు, 7 ట్రక్కులను స్వాధీనం చేసుకున్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సీఐ సంజీవ్ వివరాలు వెల్లడించారు. సూర్యాపేట జిల్లా మునగాల మండలం కొక్కిరేణి గ్రామానికి చెందిన నూకా వీరబాబు, దాసరి నాగరాజు, అదే జిల్లా గరిడేపల్లి మండలం, వెల్దండి గ్రామానికి చెందిన దేవర శ్రీధర్ ముఠాగా ఏర్పడి ట్రాక్టర్ ట్రక్కులు చోరీ చేస్తున్నారు. అందుకోసం రెండు ఇంజిన్లను కూడా చోరీ చేసి వాటి సాయంతో రైతులు పొలాల్లో, ఇళ్లకు దూరంగా నిలిపి ఉన్న ట్రక్కులను చోరీ చేస్తూ విక్రయిస్తున్నారు. ఈ క్రమంలో వారు ట్రాక్టర్లు వేసుకుని వస్తుండగా కూసుమంచిలోని కంకర మిల్లు వద్ద కూసుమంచి ఎస్‌ఐ వాహనాలు తనిఖీ చేస్తుండగా పట్టుబడ్డారు. వారిని విచారించగా కూసుమంచి మండలం నేలపట్ల గ్రామానికి చెందిన నూకల చిన్న



వివరాలు వెల్లడిస్తున్న సీఐ సంజీవ్

సైదులు, చేగొమ్మ గ్రామానికి చెందిన బొల్లం సైదులుకు చెందిన ట్రక్కులను అప్పగించగా వారు ఒక్కో ట్రక్కును రూ.60 వేలకు విక్రయించినట్లు తెలిపారు. ఐదుగురు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని సీఐ వెల్లడించారు. వీరబాబు, నాగరాజు, శ్రీధర్ సూర్యాపేట జిల్లా గరిడేపల్లితోపాటు కూసుమంచి, నేలకొండపల్లి, ఖమ్మంరూరల్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో ట్రక్కులను చోరీ చేసినట్లు వివరించారు. ఎస్‌ఐ నాగరాజు, సిబ్బంది వెంకటేశ్వర్లు, శ్రీశైలం, గోపి, రాంబాబు, రమేష్‌ను సీఐ సంజీవ్ అభినందించారు. సమావేశంలో కూసుమంచి, నేలకొండపల్లి, తిరుమలాయపాలెం ఎస్‌ఐలు నాగరాజు, సంతోష్, జగదీశ్ పాల్గొన్నారు.

కేఎంసీ ఆర్‌ఐపై కేసు కొట్టివేత

ఖమ్మంలీగల్: ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ ఆర్‌ఐ అనుముల సుధాకర్‌పై నమోదైన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసును కొట్టివేస్తూ ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ సెషన్స్ జడ్జి దేవినేని రాంప్రసాదరావు సోమవారం తీర్పు చెప్పారు. 2019, మే 3న సుధాకర్‌పై మున్సిపల్ వర్కర్ మాధవి ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు పెట్టారు. సాక్షులను విచారించిన అనంతరం, నిరాధారమైన కేసుగా నిర్ధారించి కొట్టివేశారు.

చెల్లని చెక్కు కేసులో జైలు

సత్తుపల్లిటౌన్: చెల్లని చెక్కు జారీ చేసిన ఉపాధ్యాయుడికి ఆరు నెలల జైలు శిక్ష విధిస్తూ సత్తుపల్లి అదనపు జూనియర్ సివిల్ జడ్జి వడ్డే లావణ్య సోమవారం తీర్పు వెలువరించారు. కల్లూరు మండలం విశ్వనాథపురం గ్రామానికి చెందిన ముదిగొండ్ల రామనర్సింహారావు వద్ద వైరా మండలం విప్పలమడక గ్రామానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు బూరుగు జయరాజు 2015లో రూ.8.50 లక్షలు అప్పుగా తీసుకున్నాడు. ఆ అప్పు చెల్లించే క్రమాన 2016 ఫిబ్రవరి 1వ తేదీన రూ.9.10 లక్షలకు చెక్కును ఇచ్చారు. అయితే ఆ చెక్కు బ్యాంకులో జమ చేస్తే అకౌంట్‌లో సరిపడా నగదు లేకపోవటంతో బౌన్స్ అయింది. రామనర్సింహారావు తన న్యాయవాది పిన్నం జానకీ రామారావు ద్వారా నోటీసు పంపి కోర్టులో ప్రైవేట్ కేసు దాఖలు చేశారు. సాక్షుల విచారణ అనంతరం జయరాజుకు ఆరు నెలల జైలు శిక్షతో పాటు అసలు రూ.9.10 లక్షలు, అదనంగా మరో రూ.9.10 లక్షలు చెల్లించాలని జడ్జి లావణ్య తీర్పు వెలువరించారు.

భవనం పైనుంచి దూకేందుకు యత్నం

నేలకొండపల్లి: ప్రైవేట్ కంపెనీలో అధికారి వేధింపులు తాళలేక చిరుద్యోగి భవనం ఎక్కి దూకేందుకు యత్నించగా.. తోటి ఉద్యోగులు అడ్డుకున్నారు. మండల కేంద్రంలోని ఓ ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తున్న యువకుడు పైఅధికారి కక్షసాధింపునకు పాల్పడుతున్నాడని ఆరోపిస్తూ సోమవారం అదే కార్యాలయం భవనం ఎక్కి దూకేందుకు ప్రయత్నించాడు. సహచర సిబ్బంది గమనించి భవనం నుంచి కిందకు తీసుకొచ్చారు. ఈ విషయంపై సంబంధిత అధికారిని వివరణ కోరగా.. వివరాలు వెల్లడించేందుకు నిరాకరించారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

సత్తుపల్లిటౌన్: తాళం వేసి ఉన్న ఇంట్లో దుండగులు చోరీకి పాల్పడ్డారు. పట్టణంలోని పాత ఆస్పత్రి వీధిలోని వి.కుందరి, సంధ్య దంపతులు ఈ నెల 20వ తేదీన ఇంటికి తాళం వేసి షిర్డీ యాత్రకు వెళ్లారు. శనివారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు తాళం పగులగొట్టి ఇంట్లోని బీరువాను తెరిచి, రూ.40 వేల విలువైన బంగారు చెవిదిద్దులతో పాటు రూ.10 వేల నగదును అపహరించారు. ఇంటి ముందు పార్క్ చేసి ఉన్న ద్విచక్రవాహనాన్ని చోరీ చేశారు. సోమవారం పనిమనిషి వచ్చి చూడగా తలుపులు తీసి ఉండటంతో చుట్టుపక్కల వారికి సమాచారం అందించారు. సీఐ కిరణ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

బ్రిడ్జి గోడకు ఢీకొట్టిన కారు



నుజ్జునుజ్జయిన కారు

ముదిగొండ: మండలంలోని గోకినేపల్లి వద్ద నేషనల్ హైవేపై సోమవారం కారు బ్రిడ్జి గోడకు ఢీకొన్న ఘటనలో ఒకరికి గాయాలయ్యాయి. ఖమ్మం ముస్తఫానగర్‌కు చెందిన టి.ప్రభాకర్ కారులో ఖమ్మం నుంచి నేలకొండపల్లి వెళ్తున్న క్రమంలో అదుపుతప్పి పక్కనే ఉన్న బ్రిడ్జి గోడకు బలంగా ఢీకొట్టింది. దీంతో కారు నుజ్జునుజ్జయింది. కారు నడుపుతున్న ప్రభాకర్‌కు కాలు విరగడంతో 108లో ఖమ్మం ఆస్పత్రికి తరలించారు.

ఉరివేసుకుని యువకుడు ఆత్మహత్య

పెనుబల్లి: ఉరి వేసుకుని యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన పెనుబల్లి మండల కేంద్రంలో సోమవారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన శివశంకరాచారి (36) అనారోగ్యంతో బాధపడుతూ ఆదివారం రాత్రి ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సోదరుడు ఉద్యోగ రీత్యా దమ్మపేటలో ఉంటూ సోమవారం ఉదయం తమ్ముడికి ఫోన్ చేసినా లిఫ్ట్ చేయకపోవడంతో చుట్టు పక్కలవారిని అప్రమత్తం చేశాడు. వారు వచ్చి చూడగా ఫ్యాన్‌కు శివశంకరాచారి మృతదేహం వేలాడుతూ కనిపించింది. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వెంకటేష్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

మధిర: మండలంలోని కృష్ణాపురం గ్రామ సమీపంలో సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందాడు. సిరిపురం గ్రామానికి చెందిన వేమిరెడ్డి కిశోర్‌రెడ్డి (35) గ్రామంలో చిన్న బడ్డీకొట్టు పెట్టుకొని జీవనం సాగిస్తున్నాడు. అయ్యప్ప మాల ధరించి శబరిమలై వెళ్లి సోమవారం ఇంటికి వచ్చాడు. ఎర్రుపాలెం మండలం జమలాపురంలో పుట్టింట్లో ఉన్న తన భార్యకు ప్రసాదం ఇచ్చి కుమారుడిని అక్కడ దించి తిరిగి ఇంటికి వస్తున్నాడు. కృష్ణాపురం వద్ద గుర్తుతెలియని వాహనం ఢీకొనగా కిశోర్‌రెడ్డి అక్కడికక్కడే మృతి చెందాడు. రూరల్ ఎస్‌ఐ లక్ష్మీభార్గవి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కమ్యూనిటీ హాల్‌ను ప్రారంభించిన సీఎండీ

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి కొత్తగూడెం ఏరియా పరిధిలోని రామవరంలో రూ.30 లక్షలతో ఆధునికీకరించిన కమ్యూనిటీ హాల్‌ను సోమవారం సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సింగరేణి సంస్థ కార్మికుల సంక్షేమం కోసం అనేక సదుపాయాలు కల్పిస్తోందని తెలిపారు. రామవరం ప్రాంత కార్మికులు శుభకార్యాల నిర్వహణ కోసం కమ్యూనిటీ హాల్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. తొలుత సీఎండీకి ఏరియా జీఎం ఎం.శాలేంరాజు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమాల్లో సింగరేణి డైరెక్టర్లు వెంకటేశ్వరరెడ్డి, సత్యనారాయణరావు, జీఎంలు శాలెంరాజు, సుభాని, ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్ ప్రసాద్, ఏరియా ఉపాధ్యక్షుడు ఎండీ రజాక్, ఏఐటీయూసీ నాయకులు గట్టయ్య, వీరస్వామి, అధికారులు రామకృష్ణ, రాజారామ్, కోటిరెడ్డి, శివకేశవరావు పాల్గొన్నారు.

మట్టి కట్టలు చోరీ?

- నర్సరీలు, పొలాలలకు విక్రయం
- రూ.కోట్లతో దందా

అశ్వారావుపేట: అశ్వారావుపేట పరిసర ప్రాంత మట్టి, నీరు, గాలి నాణ్యమైనవని వ్యవసాయ, ఉద్యాన అనుబంధ సంస్థలు, అన్ని రకాల పంటలకు ఈప్రాంతం ప్రసిద్ధి. అందుకే దమ్మపేట, అశ్వారావుపేట మండలాల్లో మామిడి, ఇతర ఉద్యాన మొక్కల నర్సరీలు వందల సంఖ్యలో ఉన్నాయి. అంతా అక్రమ వ్యాపారమే అయినా నర్సరీలను నియంత్రించే వారే లేరు. చివరకు సీతారామ పంప్‌హౌస్, కాల్వల మట్టిని కూడా చోరీ చేసేలా ఎగబడుతున్నారు. నర్సరీలకు అక్రమంగా ట్రాక్టర్ల ద్వారా మట్టిని రవాణా చేస్తే ఒక్కో ట్రిప్‌కు రూ.800 వరకు చెల్లించాల్సి ఉండేది. అదే సీతారామ ప్రాజెక్టు కాల్వల కట్టల నాణ్యమైన ఎర్రమట్టి అయితే టిప్పర్‌లలో ఎవరికీ అనుమానం రాకుండా రవాణా చేసుకోవచ్చు. నర్సరీలకు ఈమట్టి అవసరం కావడంతోపాటు టిప్పర్ ఆపరేటర్లు వ్యాపారం షురూ చేశారు. దాదాపు ఏడాది కాలంగా గుట్టుచప్పుడు కాకుండా జరుగుతున్న ఈ తంతు తాజాగా వెలుగులోకి వచ్చింది. ఒక్కో టిప్పర్‌కు రూ.10 వేలు పైనే చెల్లించి నర్సరీ వ్యాపారులు మట్టిని కొనుగోలు చేసినట్లు సమాచారం.

సత్తుపల్లి, పాల్వంచకు కూడా..

నాణ్యమైన ఎర్రమట్టిని దమ్మపేట, అశ్వారావుపేట మండలాల నర్సరీలకు అక్రమంగా రవాణా చేయగా.. చౌడు, ఇసుక పార, రాతి పొరల నేలల మట్టిని సత్తుపల్లి, పాల్వంచ వంటి పట్టణాలకు గృహనిర్మాణాల నిమిత్తం తరలించినట్లు సమాచారం. అంతే కాకుండా ఇటీవల జరిగిన రహదారుల నిర్మాణాల్లో బర్మ్‌ఫిల్లింగ్ కోసం కూడా ఇదే మట్టిని వినియోగించినట్లు తెలుస్తోంది. టిప్పర్ ఆపరేటర్లు కొందరు బ్రోకర్లను ఆశ్రయించి బుకింగ్ చేసుకుని రాత్రి వేళల్లో అక్రమంగా రవాణా చేస్తున్నట్లు తెలియవస్తోంది. దారి పొడవునా ముడుపులు చెల్లిస్తూ ఏశాఖ సిబ్బందితో ఇబ్బంది లేకుండా మట్టి అక్రమ రవాణాను కొనసాగిస్తున్నారు. దమ్మపేట మండలం గండుగులపల్లి పంప్ హౌస్ మట్టి కట్టలను తొలిచి మరీ మట్టి రవాణా చేస్తున్నారు. కాగా పంప్ హౌస్‌ల వద్ద లష్కర్‌లు, కాపలాదారులు ఉన్నా.. మట్టి ఎలా బయటకు వస్తుందో అర్థం చేసుకోవచ్చు. ఈ విషయాన్ని ఇరిగేషన్ డీఈఈ కృష్ణ దృష్టికి తీసుకువెళ్లగా చలానా చెల్లించిన వారికి మట్టి తవ్వుకునే అవకాశం కల్పిస్తామని, అదీ చాలా తక్కువ మొత్తంలోనే అవకాశం ఉందని, విచారణ నిర్వహిస్తామన్నారు.




సీతారామ కాల్వ నుంచి మట్టి తవ్విన దృశ్యం

కరెంట్ కోత.. చార్జీల మోత

ఏపీలో 6 నెలల్లో రూ.15 వేల కోట్లకుపైగా జనంపై భారం వేసిన కూటమి సర్కార్

ఒకపక్క విద్యుత్ బిల్లుల షాక్‌లు.. మరోపక్క కోతలు



రోజూ 2 నుంచి 3 గంటల పాటు సరఫరా నిలిపివేత

డిమాండ్ మేరకు సరఫరా చేయలేక అనధికారిక కోతలు

కరెంట్ లేక చీకట్లో గాఢాంధకారంలో అల్లాడుతున్న గ్రామాలు

ఎస్సీ, ఎస్టీలకు గత ప్రభుత్వం అందించిన ఉచిత విద్యుత్తుకు ఎగనామం

ఉచిత విద్యుత్తు లబ్ధిదారులకు రూ.వందలు.. వేలల్లో బిల్లులు జారీ చేస్తున్న కూటమి సర్కారు

తమ కష్టాలు చెప్పుకుంటే పింఛన్లు, రేషన్ కార్డులు తొలగిస్తారని ప్రజల్లో ఆందోళన

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

ఈనాడు చెవిలో ఈడీ చెప్పిందా?

దర్యాప్తు విషయాలు బహిర్గతమయ్యాయా?

లేక ఈనాడు తన అజెండాకు అనుగుణంగా కథనాలను నడిపిస్తోందా?



- రూ.3,000 కోట్ల నికర లాభాలు సాధిస్తున్న అరబిందో రూ.494 కోట్లు సమకూర్చుకోలేదా?
- నిజంగానే బెదిరించి ఉంటే పోర్టులో 100% వాటా తీసుకుంటారుగానీ 41 శాతం వాటా మాత్రమే ఎందుకు తీసుకుంటుంది?

వ్యూహాత్మక పెట్టుబడిలో భాగంగానే కాకినాడ డీప్‌వాటర్ పోర్టులో వాటాల కొనుగోలు

ఆడిటర్లను ఆయా శాఖల అధికారులు ఎంపిక చేస్తారన్న విషయం ఎల్లో మీడియాకు తెలియదా?

సాక్షి, అమరావతి: కాకినాడ డీప్ వాటర్ పోర్టులో వాటాల విక్రయంపై 'ఈనాడు' తన ఆక్రోశాన్ని మరోసారి వెళ్లగక్కింది. 150 దేశాల్లో కార్యకలాపాలు కొనసాగిస్తూ ఏటా రూ.3,000 కోట్లకు పైగా లాభాలను ఆర్జిస్తున్న కంపెనీ రూ.494 కోట్లు సమకూర్చుకోవడం కూడా పెద్ద వింత అయినట్లు ఒక విషపూరిత కథనాన్ని వండివార్చింది. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) చేస్తున్న దర్యాప్తు అంతా ఈనాడుకు చెవిలో చెబుతున్నట్లుగా "రూ.494 కోట్లు ఎక్కడి నుంచి వచ్చాయి?" అంటూ సోమవారం ఓ కథనాన్ని ప్రచురించింది. స్వయం ప్రతిపత్తి కలిగిన ఈడీ లాంటి సంస్థ దర్యాప్తు చేస్తున్న విషయాలే కాకుండా ఎవర్ని, ఎప్పుడు, ఎలా విచారిస్తారు...? వారిని ఏ ప్రశ్నలు అడుగుతారు? అనే వాటిని కథనంలో ప్రచురించడంపై పలు సందేహాలు తలెత్తుతున్నాయి. ఒకవేళ నిజంగానే విషయాలను ఇలా బయటకు చెబుతుంటే ఆ దర్యాప్తు ఎంత పక్షపాతంతో జరుగుతోందో అర్థం చేసుకోవచ్చు! లేదంటే ఈనాడు తన అజెండాకు అనుగుణంగా ఈడీ పేరుతో ఈ కథనాలను వండివార్చి ఉండాలి. ఈ రెండింటిలో ఏది నిజమైనా ఈనాడు ఎవరి ప్రయోజనాల కోసం, ఎవరి అజెండాకు డప్పు కొడుతుందో ఊహించవచ్చు!!

అది వ్యూహాత్మక పెట్టుబడి

అరో ఇన్‌ఫ్రా వ్యూహాత్మక పెట్టుబడిలో భాగంగా కాకినాడ డీప్ వాటర్‌పోర్టులో వాటాలు కొనుగోలు చేసింది. పోర్టులో 41 శాతం వాటాలను కేవీ రావు పూర్తి సమ్మతితోనే 2020లో విక్రయించడంతో పాటు ఆ వాటాల విలువ రూ.494 కోట్లను స్వీకరించారు. కాకినాడ డీప్‌వాటర్ పోర్టు దగ్గరలోనే కాకినాడ సెజ్‌ను రూ.1,700 కోట్లకు కొనుగోలు చేయడంతో పాటు ఆ సెజ్‌లో రూ.2,400 కోట్లతో మరో పోర్టును కూడా అరో ఇన్‌ఫ్రా నిర్మిస్తోంది. ఇదంతా వ్యూహాత్మక వ్యాపార ప్రణాళికలో భాగంగా జరిగింది. సెజ్‌ను ఆనుకుని ఉన్న కాకినాడ డీప్ వాటర్ పోర్టులో కూడా తమకు వాటాలు ఉంటే వ్యూహాత్మకంగా ప్రయోజనకరమని అరబిందో సంస్థ భావించింది. భవిష్యత్‌లో కాకినాడ డీప్ వాటర్ పోర్టులోని తన మెజార్టీ వాటాలను ప్రమోటర్ కేవీ రావు విక్రయించాలని భావిస్తే ముందుగా అరబిందో సంస్థకే అవకాశం ఇవ్వాలి. ఆ నిబంధన (రైట్ టు ఫస్ట్ రెఫ్యూజల్) ఒప్పందంలో ప్రధానాంశం. ఒకవేళ బెదిరించి ఉంటే మొత్తం పోర్టునే స్వాధీనం చేసుకుని ఉంటారు కదా! 41 శాతం వాటా కొనుగోలు తర్వాత కూడా పోర్టు యాజమాన్య హక్కులు కేవీరావు చేతిలోనే ఉన్నాయి కదా. ఆయన్ను నిజంగానే బెదిరించి ఉంటే అప్పుడే రిజిస్ట్రార్ ఆఫ్ కంపెనీస్, స్టాక్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా(సెబీ), నేషనల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ(ఎన్‌ఎల్‌ఎస్‌ఏ) తదితర సంస్థలకు ఫిర్యాదు చేసేవారు. న్యాయస్థానాన్ని ఆశ్రయించేవారు. కానీ కేవీ రావు ఈ నాలుగున్నరేళ్లలో ఎవరికీ ఫిర్యాదు చేయలేదు. కేవీ రావుకు అభ్యంతరం ఉంటే వాటాల బదిలీ పూర్తయ్యేలోగా వివిధ దశల్లో ఎప్పుడైనా సరే ఫిర్యాదు చేసేందుకు అవకాశం ఉంది. కానీ ఆయన ఏ దశలో కూడా ఫిర్యాదు చేయలేదు. అంటే ఆయన పూర్తి సమ్మతితోనే వాటాలను విక్రయించారన్నది స్పష్టమవుతోంది. నాలుగేళ్ల తర్వాత ఇప్పుడు ఫిర్యాదు చేశారంటే దీని వెనుక కుట్రను సులభంగా అర్థం చేసుకోవచ్చు.

ఏది నిజం?

తప్పుడు ఫిర్యాదు... వెంటనే కేసు

అనంతరం అసలు పాత్రధారి తెరపైకి వచ్చారు. ప్రభుత్వ పెద్దలకు సన్నిహితుడైన కాకినాడ డీప్ వాటర్‌పోర్ట్ ప్రమోటర్ కేవీ రావుతో ఈ నెల 2న సీఐడీకి ఫిర్యాదు ఇప్పించారు. 2020లో తనను బెదిరించి కాకినాడ డీప్ వాటర్ పోర్ట్‌లో 41శాతం వాటాను అరబిందో సంస్థకు చెందిన అరో రియాల్టీ సంస్థ కొనుగోలు చేసిందని ఆయన నాలుగేళ్ల తరువాత ఫిర్యాదు చేయడం చంద్రబాబు పక్కా కుట్రను స్పష్టం చేస్తోంది. విచిత్రం ఏమిటంటే... కేవీ రావు ఇచ్చిన తప్పుడు ఫిర్యాదు చేసిన ఈ నెల 2నే సీఐడీ కేసు నమోదు చేసేయడం గమనార్హం

ఆడిట్ సంస్థను ఎంపిక చేసేది ఆ శాఖ కార్యదర్శి

ప్రభుత్వాలు వివిధ విభాగాల్లో ఆడిటింగ్ నిర్వహించడం సాధారణం. ఏదైనా విభాగంలో ఆడిటింగ్ నిర్వహించాలంటే ఆ శాఖకు చెందిన కార్యదర్శి ఆడిటింగ్ సంస్థను ఎంపిక చేస్తారు. ఇక్కడ కూడా అదే విధంగా పీకేఎఫ్ శ్రీధర్ అండ్ సంతానం ఎల్‌ఎల్‌పీ అనే ఆడిటింగ్ సంస్థను ఎంపిక చేశారు. ఆ ఆడిటింగ్ సంస్థకు, విజయసాయిరెడ్డికి ఏమిటి సంబంధం? లేని సంబంధాలను అంటగట్టి మసిబూసి మారేడు కాయ చేయాలని, తద్వారా ఎల్లో గ్యాంగ్‌కు ప్రయోజనం కలిగించేందుకు ఈనాడు పడరానిపాట్లు పడుతోంది.



ప్రభుత్వ పోర్టును కారుచౌకగా కట్టబెట్టింది బాబే

కాకినాడ డీప్ వాటర్ పోర్టును ప్రైవేటుపరం చేసింది గతంలో చంద్రబాబు ప్రభుత్వమేనన్నది అసలు వాస్తవం. ఆసియా అభివృద్ధి బ్యాంకు, ఏడీబీ రుణాలతో ఏపీ ప్రభుత్వం కాకినాడ డీప్ వాటర్ పోర్ట్‌ను 1997లో నిర్మించింది. లాభాల్లో ఉన్న ఆ పోర్టును 1999లో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబే కారు చౌక ధరకు ప్రైవేటుపరం చేశారు. ఓ మలేషియా కంపెనీని ముందు పెట్టి కాకినాడ డీప్‌వాటర్ పోర్టును కారు చౌకగా కట్టబెట్టేశారు. కానీ తరువాత అసలు విషయం వెలుగు చూసింది. మలేషియా కంపెనీ ముసుగులో చంద్రబాబు సన్నిహితుడు కేవీ రావు ఆ పోర్టును దక్కించుకున్నట్లు బయటపడింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మొదలు పెట్టిన రామాయపట్నం, మచిలీపట్నం, మూలపేట పోర్టులను కూడా చంద్రబాబు తన బినామీలకు కట్టబెట్టేందుకు రంగం సిద్ధం చేస్తుండటం గమనార్హం.

ప్రైవేట్ ఒప్పందంతో ప్రభుత్వానికి ఏం సంబంధం?

అరబిందో సంస్థ 150 దేశాల్లో వ్యాపార కార్యకలాపాలు నిర్వహిస్తూ అంతర్జాతీయంగా విశేష గుర్తింపు పొందింది. ఏటా రూ.72 వేల కోట్ల టర్నోవర్, రూ.3 వేల కోట్ల నికర లాభం నమోదు చేస్తోంది. ఆ వ్యాపార లావాదేవీ పూర్తిగా అరబిందో సంస్థ, కేవీ రావు మధ్య జరిగిన ప్రైవేట్ ఒప్పందం. అందులో అప్పటి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికిగానీ, ఇతరులకుగానీ ఎలాంటి సంబంధం లేదు. కాకినాడ డీప్ వాటర్ పోర్టులో వాటాల విక్రయం అన్నది పూర్తిగా రెండు ప్రైవేటు సంస్థల మధ్య వ్యవహారం. ఐదేళ్ల తరువాత చంద్రబాబు ప్రభుత్వం ఆ వ్యవహారంలో తల దూర్చడం వెనుక పక్కా కుట్ర ఉందని స్పష్టమవుతోంది. ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వం రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమాన్ని పట్టించుకోకుండా ప్రైవేటు ఆస్తుల వ్యవహారాల్లో జోక్యం చేసుకుంటూ దందా సాగిస్తుండటం విభ్రాంతికరం. రెండు సంస్థల మధ్య ప్రైవేటు వ్యవహారంలో టీడీపీ కూటమి ప్రభుత్వం జోక్యం వెనుక మర్మం ఏమిటి? ప్రభుత్వం మారగానే అంతకుముందు జరిగిన ప్రైవేటు వ్యవహారాల్లో జోక్యం చేసుకుంటామంటే రాష్ట్రంలోనే కాదు దేశంలో కూడా ఓ దుష్ట సంప్రదాయానికి తెరతీసినట్టు అవుతుంది. పరస్పర అంగీకారంతో ప్రైవేటు ఆస్తుల కొనుగోలు, అమ్మకాలు సాగుతుంటాయి. ఐదేళ్ల తరువాత సహజంగానే ఆ ఆస్తుల మార్కెట్ విలువ పెరుగుతుంది. మార్కెట్ విలువ పెరిగింది కాబట్టి ఐదేళ్ల క్రితం తనను బెదిరించి ఆస్తిని అమ్మేలా చేశారని ఫిర్యాదు చేస్తామంటే ఎలా..? వాటిలో ప్రభుత్వం జోక్యం చేసుకుంటే పరిస్థితి ఎంతవరకు వెళుతుంది ?

అంతా బాబు కుట్ర స్క్రిప్టే...

కాకినాడ డీప్ వాటర్ పోర్టులో వాటాలను హస్తగతం చేసుకునేందుకు చంద్రబాబు పన్నాగం పన్నారు. ఈ క్రమంలో పోర్ట్ నుంచి బియ్యం అక్రమ రవాణాను తెరపైకి తెచ్చి జనసేనలోని తన కోవర్ట్, మంత్రి నాదెండ్ల మనోహర్‌ను కాకినాడ పర్యటనకు పంపారు. అనంతరం డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, నాదెండ్ల మనోహర్ గత నెల 29న ఢిల్లీ నుంచి రాజమహేంద్రవరం చేరుకుని కాకినాడలో వాలారు. కాకినాడ యాంకరేజ్ పోర్ట్ వద్దకు చేరుకుని రేషన్ బియ్యం అక్రమ రవాణా చేస్తున్నారంటూ డ్రోన్ కెమెరాలతో డ్రామా పండించారు. యాంకరేజ్ పోర్ట్‌ను ప్రభుత్వమే నిర్వహిస్తోంది. మరి అక్కడ నుంచి రేషన్ బియ్యం స్మగ్లింగ్ జరిగితే వారు ప్రశ్నించాల్సింది ముఖ్యమంత్రి చంద్రబాబునే కదా!!

జిల్లా వార్తలు

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి


ఐటీడీఏ డీడీ రమాదేవి



గిరిజనుల సమస్యలు తెలుసుకుంటున్న మణెమ్మ, అధికారులు

భద్రాచలం: గిరిజనులకు ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికాభివృద్ధి సాధించాలని ఐటీడీఏ డీడీ మణెమ్మ అన్నారు. సోమవారం ఐటీడీఏ సమావేశ మందిరంలో నిర్వహించిన గిరిజన దర్బార్‌లో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారి నుంచి ఆమె దరఖాస్తులు స్వీకరించారు. వారి సమస్యలు తెలుసుకుని సంబంధిత యూనిట్ అధికారులకు ఎండార్స్ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రతీ దరఖాస్తును ఆన్‌లైన్‌లో రిజిస్టర్ చేసి, పరిశీలించాక అర్హతల మేరకు పరిష్కరించాలని సూచించారు. ప్రతి గిరిజన కుటుంబానికి సంక్షేమ పథకాలు అందేలా అధికారులు కృషి చేయాలన్నారు. గిరిజనులు సైతం పథకాలను సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. ప్రధానంగా గిరిజన యువత స్వయం ఉపాధి పథకాల వైపు మొగ్గు చూపి ఆదర్శంగా నిలవాలని పిలుపునిచ్చారు. ఈ దర్బార్‌లో గిరిజన సంక్షేమ శాఖ ఈఈ తానాజీ, ఎస్‌డీసీ రవీంద్రనాథ్, గురుకులాల ఆర్‌సీఓ నాగార్జున రావు, ఎస్‌ఓ భాస్కరన్, ఆర్‌ఓఎఫ్‌ఆర్ డీటీ లక్ష్మీనారాయణ, అధికారులు మునీర్ పాషా, దినారాయణ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ కరాటే టోర్నీలో కాంస్య పతకం



గణేష్‌ను అభినందిస్తున్న దృశ్యం

ఖమ్మం స్పోర్ట్స్ : మధ్యప్రదేశ్ రాష్ట్రం ఇండోర్‌లో ఈనెల 20 నుంచి 24 వరకు జరుగుతున్న జాతీయస్థాయి అండర్ –19 పాఠశాలల కరాటే పోటీల్లో ఖమ్మానికి చెందిన గోపతి గణేష్‌కు కాంస్య పతకం లభించింది. 82 కేజీల బరువు కేటగిరీలో గణేష్ తొలి రౌండ్ నుంచి చివరి వరకు పోరాట పటిమ కనబరిచి పతకం దక్కించుకోవడం విశేషం. తండ్రి గోపతి సైదులు వద్ద శిక్షణ తీసుకున్న గణేష్.. జాతీయస్థాయిలో పతకం సాధించడం పట్ల జిల్లా అండర్ –19 క్రీడల కార్యదర్శి ఎండీ మూసాకలీంతో పాటు పలువురు అభినందించారు.

యాచించడం కాదు.. సాధిస్తాం!



గ్రూప్ సభ్యులకు రుణం చెక్కు అందజేస్తున్న అర్ధనారీశ్వరి సంఘం సభ్యులు (ఫైల్)

- స్వయం ఉపాధి సంఘంగా హిజ్రాలు
- రాష్ట్రంలోని తొలిసారి ఏర్పాటు
- అర్ధనారీశ్వరి గ్రూప్‌నకు రూ.3 లక్షల రుణం
- కలెక్టర్ చొరవతో స్వయం ఉపాధి దిశగా అడుగులు

ఖమ్మంమయూరిసెంటర్: సమాజం సహకరించకున్నా, తల్లిదండ్రులు చేరదీయకపోయినా, చుట్టుపక్కల వారు చీదరించుకుంటున్నా పంటి బిగువన కన్నీరు అదిమి పడుతూనే వారు బతుకు బండిని సాగదీస్తున్నారు. యాచించడం తప్ప వేరే ఏ పని దక్కకపోవడంతో భారంగా బతుకుతున్న వారికి ఇప్పుడు ప్రభుత్వం అండగా నిలుస్తోంది. స్వయం ఉపాధికి అవకాశం కల్పిస్తే సగౌరవంగా బతుకుతామని ముందుకొచ్చిన కొందరు హిజ్రాలు ఇటీవల కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్‌ను కలిశారు. యాచకులుగా ఉన్న తమకు సమాజంలో తలెత్తుకుని జీవించేలా అవకాశం కల్పించాలని విన్నవించారు. దీంతో కలెక్టర్ ఆదేశాల మేరకు మెప్మా అధికారులు రాష్ట్రంలోనే తొలిసారి ఖమ్మం కేంద్రంగా హిజ్రాలతో స్వయం సహాయక సంఘాన్ని ఏర్పాటుచేశారు.

అందరూ ఉన్నా ఏకాకులే..

సమాజంలో హిజ్రాలు ఏకాకులుగానే మిగులుతున్నారు. వీరికంటూ కుటుంబం ఉన్నా కలిసి బతకలేని పరిస్థితి. తమ కుటుంబంలో హిజ్రా ఉన్నారంటే ఛీత్కారాలు ఎదురవుతాయనే భయంతో తల్లిదండ్రులే బయటకు పంపిస్తున్నారు. దీంతో వారు యాచించడాన్నే జీవనోపాధిగా మార్చుకుని బతుకు బండి ఈడుస్తున్నారు. ఏదైనా అనారోగ్యంతో లేవలేని పరిస్థితి ఎదురైతే పస్తులు ఉండాల్సి వస్తుండడంతో వారి జీవనం దినదినగండంగా ఉంటోంది. ప్రభుత్వాలు పథకాలు ప్రవేశపెడుతున్నప్పటికీ వీరి కోసం ఏదీ ప్రత్యేకంగా లేకపోవడంతో లబ్ధి జరగడం లేదు.

ఉపాధి చూపాలంటూ..

జీవన పోరాటంలో అలసిపోయిన కొందరు హిజ్రాలు స్వయం ఉపాధితో గౌరవ ప్రదంగా జీవించాలని నిర్ణయించుకున్నారు. ఇందులో భాగంగా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్‌ను కలిసి తమ ఇబ్బందులను వివరించారు. రుణసాయం అందిస్తే స్వయం ఉపాధి యూనిట్ ఏర్పాటు చేసుకుంటామని తెలిపారు. దీంతో కలెక్టర్ స్వయం ఉపాధికి మార్గం చూపాలని మెప్మా అధికారులను ఆదేశించారు.

మహిళలు కాకుండా మొదటిసారి..

హిజ్రాలకు స్వయం ఉపాధి ఎలా చూపించాలనే కోణంలో మెప్మా అధికారులు పలు మార్గాలను అన్వేషించారు. అనంతరం మహిళలతో కాకుండా హిజ్రాలతో తొలిసారి స్వయం సహాయక సంఘాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. అయితే, బ్యాంకర్లు రుణం ఇస్తామని హామీ ఇచ్చాకే సంఘాన్ని ఏర్పాటు చేయడంతోపాటు సంఘం పేరిట ఖాతాలు తెరిచారు. ఈ సంఘంలో పది మంది హిజ్రాలు సభ్యులుగా ఉండగా అర్ధనారీశ్వరి సంఘంగా పేరు పెట్టారు.

రుణం కోసం ఇబ్బందులెన్నో..

మెప్మా అధికారులు స్వయం సహాయక సంఘాన్ని ఏర్పాటు చేసేందుకు ముందుకొచ్చినా మిగతా ప్రక్రియ సాఫీగా సాగలేదు. ప్రధానంగా బ్యాంకర్లు హిజ్రాలకు రుణాలు ఎలా ఇవ్వాలని ప్రశ్నించారు. ఇప్పటివరకు మహిళలకు మాత్రమే రుణాలు ఇచ్చామని, హిజ్రాలకు ఇవ్వడానికి నిబంధనలు ఒప్పుకోవంటూ తిరస్కరించారు. అయినా అటు అధికారులు, ఇటు హిజ్రాలు పట్టువదలకుండా తమ ప్రయత్నాలు కొనసాగించారు. చివరకు ఖమ్మంలోని ఇండియన్ బ్యాంక్ మేనేజర్ ప్రీతి రుణం ఇచ్చేందుకు అంగీకరించడమే కాక అన్నమాట ప్రకారం తాజాగా రూ.3 లక్షల బ్యాంక్ రుణం చెక్కు అందజేశారు.

ఏం చేయాలి...

ఇప్పటి వరకు యాచించడమే తప్ప మరో పని చేయని హిజ్రాలు ఇప్పుడు రుణం అందడంతో స్వయం ఉపాధి మార్గాలపై దృష్టి సారించారు. కలెక్టర్, మెప్మా అధికారుల సహకారంతో రుణం పొందిన వారు తమ ఆలోచనలకు పదును పెడుతున్నారు. అధికారుల నుంచి సలహాలు తీసుకుంటూనే పది మంది కలిసి ఏ వ్యాపారం పెడితే బాగుంటుందనే కోణంలో ఆరా తీస్తున్నారు. డెయిరీఫామ్, కోళ్ల పెంపకం వంటివి చేపడితే బాగుంటుందనే సలహాలు అందగా... అధికారులతో చర్చించి త్వరలోనే యూనిట్ ఏర్పాటుకు అడుగులు వేస్తున్నారు.

నమ్మకం కోల్పోకుండా ప్రయత్నించాం..



కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, మెప్మా, బ్యాంకు అధికారులకు ఎన్నిసార్లు కృతజ్ఞతలు చెప్పినా సరిపోదు. సంఘం ఏర్పాటుకు తొలుత ఇబ్బందులు పడ్డాం. అయినా నమ్మకం కోల్పోకుండా ప్రయత్నించాం. ప్రస్తుతం అందిన రుణంతో స్వయం ఉపాధి యూనిట్ ఏర్పాటు చేసుకుంటాం. మా సంఘం ఇంకొన్ని గ్రూపుల ఏర్పాటుకు బాటలు వేసేలా చూస్తాం.

– సీహెచ్.సోని, గ్రూపులీడర్, అర్ధనారీశ్వరి సంఘం, ఖమ్మం

సంతోషంగా ఉంది..



ప్రభుత్వ సాయం కోసం ఏళ్లుగా ఎదురుచూస్తున్నాం. మాకు ఉపాధి అవకాశాలు కల్పించాలని ఎందరినో కలిశాం. ఎవరూ మాకు మద్దతుగా నిలవలేదు. కలెక్టర్, మెప్మా అధికారులు మా కోసం నిలబడి రుణం ఇప్పించారు. కోళ్లఫామ్ లేదా డెయిరీ ఫామ్ ఏర్పాటు ఆలోచనలో ఉన్నాం. యాచించడాన్ని ఇకపై వదిలి స్వయం ఉపాధి రంగంలో కష్టపడతాం.


– ఆర్.మాధురి, గ్రూప్ రెండో లీడర్, అర్ధనారీశ్వరి సంఘం

పాఠశాలలకు చేరుతున్న బియ్యం

సాక్షి ఎఫెక్ట్..

నేలకొండపల్లి : సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగుల సమ్మెతో పాఠశాలలకు ప్రభుత్వం అందించే బియ్యం చేరని వైనంపై ఆదివారం సాక్షిలో 'పాఠశాలలకు నిలిచిన బియ్యం సరఫరా' అనే కథనం ప్రచురితం కాగా, స్పందించిన డీఈఓ సోమశేఖర శర్మ ఎంఈఓలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. తంబ్(వేలిముద్రలు) వేసే అధికారం ఎంఈఓలకే అప్పగిస్తూ.. సత్వరమే చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఎక్కడా ఇబ్బంది కలుగకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. జిల్లాలోని 21 మండలాల్లో దాదాపు 632 మంది ఉద్యోగులు సమ్మెలో ఉన్నారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల మధ్యాహ్న భోజనానికి అవసరమైన బియ్యాన్ని ఆయా మండల లెవల్ స్టాక్ పాయింట్ల నుంచి పాఠశాలలకు తరలిస్తుంటారు. ఇందుకుగాను మండల విద్యా వనరుల కేంద్రంలో పనిచేసే సీఆర్‌పీలు వేలిముద్రలు వేస్తేనే బియ్యం సరఫరా చేసేవారు. ప్రస్తుతం వీరంతా సమ్మెలో ఉండడంతో పాఠశాలలకు బియ్యం నిలిచిపోయాయి. 'సాక్షి' కథనంతో జిల్లా అధికారులు చర్యలు చేపట్టారు. ఎంఈఓలకు తంబ్ వేసే అధికారం కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో అన్ని ప్రభుత్వ పాఠశాలలకు బియ్యం సరఫరా కార్యక్రమం సోమవారం ప్రారంభమైంది.

కేజీబీవీలో బోధన ఎట్లా..?



డిజిటల్ పాఠాలు వింటున్న పదో తరగతి విద్యార్థులు

- సమీపిస్తున్న వార్షిక పరీక్షలు
- ఆందోళన చెందుతున్న విద్యార్థులు
- సమ్మెలో సర్వ శిక్ష ఉద్యోగులు

టేకులపల్లి: ఇచ్చిన హామీ ప్రకారం సమగ్ర శిక్ష ఉద్యోగులందరినీ పర్మనెంట్ చేయాలని, మినిమం టైమ్ స్కేల్ అమలు చేయాలని, సర్వ శిక్ష ఉద్యోగులందరినీ విద్యాశాఖలో విలీనం చేసి ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా సెలవులు, ఇతర సదుపాయాలు కల్పించాలని కోరుతూ రాష్ట్రవ్యాప్తంగా 14 రోజులుగా సర్వ శిక్ష ఉద్యోగులు సమ్మె చేస్తున్న విషయం తెలిసిందే. ఈ సమ్మెలో కేజీబీవీ (పాఠశాల, కళాశాల)ల్లో పనిచేసే సీఆర్‌టీ, పీజీసీఆర్‌టీలు కూడా ఉండటంతో ఆ పాఠశాలల్లో విద్యాబోధన కుంటు పడింది. 14 రోజులుగా కేజీబీవీ ఉద్యోగులు సమ్మెలో ఉండగా విద్యాశాఖ కనీస ప్రత్యామ్నాయం ఏర్పాటు చేయకపోవడంతో పదో తరగతి, ఇంటర్ విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు.

విద్యాబోధన లేక అవస్థలు

కేజీబీవీల్లో ఆరో తరగతి నుంచి ఇంటర్ వరకు విద్యాబోధన ఉంటుంది. మార్చి 5 నుంచి ఇంటర్, 21 నుంచి పదో తరగతి పబ్లిక్ పరీక్షలు, ఫిబ్రవరిలో ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు ఉన్నాయి. ఇంటర్ విద్యార్థులకు ఇంకా సిలబస్ కూడా పూర్తి కాలేదు. పదో తరగతి విద్యార్థులకు కూడా సిలబస్ పూర్తి కాలేదు. ఈ నేపథ్యంలో సబ్జెక్టు టీచర్లు, లెక్చరర్లు సమ్మెలో ఉండటంతో కేజీబీవీ విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. బోధించే వారు లేకపోవడంతో తరగతి గదిలో ఏర్పాటు చేసి ఉన్న డిజిటల్ స్క్రీన్‌లను విద్యార్థులే ఆన్ చేసుకుని వివిధ పాఠ్యాంశాలను వింటున్నారు. కేజీబీవీల్లో బాలికల సంరక్షణ కోసం రోజుకి ఇద్దరు చొప్పున సీఆర్‌టీలు సంతకాలు పెట్టకుండా, బోధన చేయకుండానే విధులు నిర్వహిస్తున్నారు. వంట వర్కర్లు కూడా కొందరు విద్యార్థులకు వంట చేసి వడ్డించి సమ్మెలో ఉంటున్నారు. సీఆర్‌పీలు, ఎంఐఎస్, మెసెంజర్లు లేకపోవడంతో ఎంఆర్‌సీ భవనాలు మూతపడ్డాయి. ఇదిలా ఉండగా జీసీడీఓ అన్నామణి శుక్రవారం టేకులపల్లి కేజీబీవీని సందర్శించారు. సమ్మె కారణంగా పాఠశాలలో పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఇంటర్ విద్యార్థులకు ఇంగ్లిష్ బోధన చేశారు.



టేకులపల్లి కేజీబీవీలో ఇంటర్ విద్యార్థులకు ఇంగ్లిష్ పాఠాలు బోధిస్తున్న జీసీడీఓ అన్నామణి

సమ్మెలో ఎవరెవరంటే..

జిల్లాస్థాయిలో ఏపీఓ, సిస్టమ్ ఎనాలసిస్టులు, టెక్నికల్ పర్సన్లు, ఆపరేటర్లు, డీఎల్ఎంటీ, మెసెంజర్లు మండలస్థాయిలో ఎంఐఎస్ కోఆర్డినేటర్లు, ఐఈఆర్‌పీలు, కంప్యూటర్ ఆపరేటర్లు, మెసెంజర్లు.. కాంప్లెక్స్ స్థాయిలో క్లస్టర్ రిసోర్స్ పర్సన్లు (సీఆర్‌పీ) పాఠశాలస్థాయిలో ఆర్ట్, క్రాఫ్ట్, వర్క్ ఎడ్యుకేషన్ టీచర్లు కేజీబీవీ/యూఆర్‌ఎస్‌లలో స్పెషల్ ఆఫీసర్లు, పీజీసీఆర్‌టీ, సీఆర్‌టీ, ఏఎన్ఎం, ఎకౌంటెంట్, క్రాఫ్ట్, కంప్యూటర్ ఇన్‌స్ట్రక్టర్లు, వంట వర్కర్లు, వాచ్ ఉమెన్లు, స్వీపర్లు, స్కావెంజర్లు వీరంతా సమ్మెలోనే ఉండటం గమనార్హం. కాగా, భద్రాద్రి జిల్లాలో 14 కేజీబీవీలు ఉండగా 3,702 మంది విద్యార్థులు, 335 మంది ఉద్యోగులు, ఖమ్మం జిల్లాలో 14 పాఠశాలలు ఉండగా 4,500 మంది విద్యార్థులు, 360 మంది ఉద్యోగులు ఉన్నారు.

సిలబస్ కాక భయంగా ఉంది..



12 రోజులుగా సబ్జెక్టు టీచర్లు సమ్మె చేస్తున్నారు. పబ్లిక్ పరీక్షలు సమీపిస్తున్నాయి. ఇంకా బయాలజీ, గణితం, ఫిజిక్స్ సిలబస్ కూడా పూర్తి కాలేదు. ఏం చేయాలో అర్థం కావడం లేదు. ఇప్పటివరకు పూర్తయిన సబ్జెక్టులను చదువుకుంటున్నాం. క్లాసులో ఉన్న డిజిటల్ స్క్రీన్‌ని ఆన్ చేసుకుని పాఠ్యాంశాలు వింటున్నాం. పబ్లిక్ పరీక్షలను తలుచుకుంటే భయమేస్తోంది. సబ్జెక్టు టీచర్లు వచ్చి పాఠ్యాంశాలు బోధించాలని కోరుతున్నాం.

–భవిత, శ్రీవేణి, పదో తరగతి